హక్కుల కోసం పోరాటం చేస్తాం

పతాకావిష్కరణ చేస్తున్న సంఘం నాయకులు

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 9 : ఉపాధ్యాయుల హక్కుల కోసం ఎస్టీయూ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. భూమన్నయాదవ్ అన్నారు. ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్మల్‌లోని సంఘం కార్యాలయంలో సంఘ సభ్యుడు అయిటి రఘురాజ్ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షు డు మాట్లాడుతూ 1947లో ఎస్టీయూ ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుందన్నారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శి మారెడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి సిరాజొద్దీన్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అరికట్టాలి

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సంగెపు

ఇచ్చోడ, జూన్ 9 : ఈ ఖరీఫ్ సీజన్‌లో చిరు వ్యాపారులు గుజరాత్ నుంచి బీజీ3(రౌండప్) పత్తి విత్తనాలను జిల్లాలో సరఫరా చేస్తున్నారని, అధికారులు వీటిని అరికట్టాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని సూచించారు. సమావేశంలో రైతులు రమేష్, కర్తర్ సింగ్, హన్మంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రజక సంఘం అభివృద్ధికి రూ.లక్ష విరాళం

రజక సంఘం సభ్యులను సన్మానిస్తున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్

ఎదులాపురం, జూన్ 9 : రజక సంఘం అభివృద్ధికి ఒక నెల వేతనం రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్నట్లు తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో పట్టణ రజక సంఘం అధ్యక్షప్రధాన కార్యదర్శులు సంతోష్, వినోద్‌లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికైన వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కారించి అభినందలు తెలియజేశారు. కొండూరు గంగాధర్ మాట్లాడుతూ.. రజక సంఘ భవనం నిర్మాణానికి తనవంతుగా సహాయాన్ని అందించి భవిష్యత్తులో అన్ని కార్యక్రమాలకు అంగగా ఉంటనని హామీఇచ్చారు.

పార్టీలో కష్టపడిన వారికే గుర్తింపు

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ

ఉట్నూర్, జూన్ 9 :పార్టీలో కష్టపడిన వారికే గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. ఆదివారం స్థానిక ఆమే నివాసంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ఇటీవల ఆదిలాబాద్ ఎంపీ స్థానం గెలిచే అవకాశాలు చేజార్చుకోవడం బాధకరం అన్నారు. గెలుపుకోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, సత్తుపల్లి మల్లేష్‌లు కృషి చేశారన్నారు. ఇప్పటి నుంచి పూర్తిగా పార్టీ కార్యకలాపాలలో ఉంటూ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ జాతీయ కమిటీని కలవనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ విభాగం జిల్లా నాయకులు లింగంపల్లి చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఖయ్యూం, నాయకులు ఎక్బాల్, రాజమణి, సలీం, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిస్సెస్ వరల్డ్ పీస్ చంద్రికకు ఘన సన్మానం

డాక్టర్ చంద్రిక అవినాష్‌ను సన్మానిస్తున్న నిర్మల్ వాసులు

నిర్మల్ అర్బన్, జూన్ 9 : హర్యాన రాష్ట్రంలో జరిగిన మిసెస్స్ వరల్డ్ పీస్ ఇంటర్నేషనల్ 2024 అందాల పోటీల్లో డాక్టర్ చంద్రిక అవినాష్ విన్నర్‌గా నిలిచి కిరీటం సాధించింది. ఇందుకు గాను ఆదివారం తెలంగాణ బీసీ మహా సభ రాష్ట్ర కార్యదర్శి యాటకారి సాయన్న ఆధ్వర్యంలో పలువురు శాలువాతో ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ మహా సభ జిల్లా అధ్యక్షుడు మూర్తి ప్రభు, సుంకరి సాయి, బొడ్డుల వెంకట రమణ, ఉన్నారు.

త్వరలో ఉపాధ్యాయుల బదిలీ షెడ్యూల్ విడుదల

ఇచ్చోడ, జూన్ 9 : గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కౌన్సెలింగ్, ఉత్తర్వులు త్వరలో విడుదల అవుతుందని రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పి విజయశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత ఫైల్‌పై ముఖ్యమంత్రి సంతకం అవసరం ఉన్నందున సంఘం రాష్ట్ర నాయకులు సోమవారం ప్రత్యేకంగా ముఖ్య మంత్రికి, ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి సంబంధిత షెడ్యూల్ విడుదల కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. వారం రోజులుగా రాష్ట్ర నాయకులు ఉన్నతాధికారులతో చర్చించడం జరిగిందన్నారు. దీంతోపాటు భాషా పండితుల అప్‌గ్రేడేషన్, పీఈటీల అప్‌గ్రేడేషన్ కోసం సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

సేంద్రియ ఎరువులతో పంటలకు మేలు

- పంట దిగుబడి అధికం
- పెరగనున్న భూసారం
- తక్కువ పెట్టుబడితో అధిక దిగబడులు

పంట పొలాల్లో నిల్వ ఉన్న పశువుల పేడ

దస్తురాబాద్, జూన్ 9 : పంటలకు సేంద్రియ ఎరువులు వాడడమే ఎంతో మేలు అని వ్యవసాయ అధికారులు అంటున్నారు. అధిక దిగుబడి కోసం రైతన్నలు విచక్షణారహితంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుతున్నారు. ఫలితంగా భూసారం దెబ్బతింటున్నది. పర్యావరణం సైతం కలుషితమై ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తే మంచిది. సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువులు పంటలకు ఎంతో మేలు చేస్తుంది. వానకాలం పొలాల సాగుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. భూసారానికి మేలు చేకూరుతుండగా, పంట దిగుబడికి దోహదం చేస్తుందని అధికారులు అంటున్నారు. పశువుల పేడ, చెత్త చెదారం, ఎండిన ఆకులతో కూడిన పెంటను పొలాల్లో వేయడం ద్వారా భూసారం పెరుతుగుంది. దీంతో పాటు కోడి ఎరువు, మేకల, గొర్రెలను వ్యవసాయ భూముల్లో జీవాల మందను ఉంచడం వంటి వాటి వల్ల కూడా ప్రయోజనం ఉంటుందన్నారు.

దిగుబడి ఎక్కువే..

పొలాల్లో పశువుల పేడ వేసిన తర్వాత భూమిని కలియదున్నడంతో వాటిలో ఉండే నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలు తగిన మొతాదులో అంది మొక్కలు బాగా పెరిగి పంట దిగుబడి వస్తుంది. సేంద్రియ ఎరువైన, పశువుల పేడ పంటల పొలాల్లో వేయడంతో పంటల సాగుకు జీవిత కాలం పెరుగుతుంది. కొంత మంది రైతులు చెరువుల పూడిక మట్టి(నల్ల మట్టి)ని సైతం వ్యవసాయ భూమిలో పోయించుకుని భూసారాన్ని పెంచుకుంటున్నారు. నల్లమట్టి నీటిని ఎక్కువగా పీల్చుకుని నేలలో చాలా సమయం వరకు తేమ ఉండేటట్టు చేస్తుంది. దీంతో మొక్కకు నీటి లాభ్యత ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుంది.

నేలకుల బలం

సేంద్రియ ఎరువులు వాడడం వలన నేలకు సహజంగా బలం వస్తుంది. ఫలితంగా భూసారానికి మేలు జరుగడంతో పాటు రైతులకు ఎరువుల భారం కూడా తగ్గుతుంది. పంటలు కూడా బాగా పండుతాయి. రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అధిక ఎండల కారణంగా పొలంలో వెదజల్లితే వాటిలోని పోషకాలు ఆవిరి అవుతాయి. భూమిలోని తగు తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి దుక్కిలో కలియదున్నాలి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలను పొందవచ్చు.

రసాయనిక ఎరువులు వాడద్దు

రసాయనిక ఎరువులు వాడద్దు అని, పశువుల ఎరువులు, సేంద్రియ ఎరువులు వాడడం వలన భూమిలో ఉన్న ఆమ్లాలు, క్షారాల స్థాయిని నిలబెడుతుంది. రసాయనిక ఎరువులు వాడకం తగ్గుతుంది. పంటల దిగుబడి రావడంతో పాటు, సాగుకు అయ్యే ఖర్చు కూడా తగ్గుతుంది. రైతులు వృథాగా ఉన్న పశువుల పెడను సేకరించి పంట పొలాల్లో వేసుకుంటే అధిక దిగుబడిని సాధించవచ్చు. అధికారులు సలహాలు, సూచనలు పాటించాలి.

- జాడి తిరుపతి, వ్యవసాయ విస్తరణ అధికారి, దస్తురాబాద్

విద్యార్థికి సన్మానం

నర్సాపూర్ జి, జూన్ 9 : చదువుకు పేదరికం అడ్డు కాదని గ్లోబల్ హెల్త్ ఈక్విటీ రీజనల్ ఆసియా ఫసిఫిక్ అండ్ జపాన్ రిజినల్ మేనేజర్ డా.చాట్ల చక్రపాణి అన్నారు. మండల కేంద్రానికి చెందిన మద్దెర్ల అక్షయ నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకు పొంది సీటు సంపాదించడంతో పద్మశాలి సంగంలో ఆదివారం కుల సంఘ పెద్దలతో కలిసి ఆయన విద్యార్థిని ఘనంగా సన్మానించారు. చాట్ల దామోదర్ పౌండేషన్ తరపున రూ.25000 అందజేశారు. ఈ కార్యక్రమంలో యం. బక్కన్న,చాట్ల దామోదర్, రాజెంధర్, పి.గంగారాం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 9 : నిర్మల్ పట్టణంలోని అతి పురాతనమైన శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవరకోట దేవస్థాన ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, కలశపూజ, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, దర్మకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పెంబి, జూన్ 9 : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ జగిత్యాల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేయర్, సూపర్‌వైజర్ స్ట్రక్చర్, ఎలక్రీషియన్, వెల్డింగ్, ప్లంబర్, పెయింటర్‌తో పాటు మూడు నెలల పాటు శిక్షణ, హాస్టల్, బోజన సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9701665683ను సంప్రదించాలన్నారు.

భీంపూర్ ఎస్ఐగా మహమ్మద్ ఖలీల్

తాంసి(భీంపూర్), జూన్ 9 : భీంపూర్ ఎస్ఐగా మహమ్మద్ ఖలీల్ ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఆదిలాబాద్ టూటౌన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా ఇక్కడ ఎస్‌హెచ్‌వోగా ఉన్న ప్రదీప్ కుమార్‌ను జిల్లాకేంద్రానికి బదిలీ చేశారు.

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం

నార్నూర్, జూన్ 9 : గాదిగూడ మండలం లోకారి(బీ)గ్రామానికి చెందిన కవిత-విశ్వనాథ్ దంపతుల కుమారుడు రాజ్‌కుమార్ ఆర్మీ ఉద్యోగంలో శిక్షణ పూర్తి చేసి స్వగ్రామానికి రావడంతో ఆయా సంఘాల నాయకులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఘన స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ మెస్రం జారు, ఉపాధ్యాయుడు మెస్రం శేఖర్‌బాబు గ్రామ పెద్దలతో కలిసి ఆర్మీజవాన్‌ను శాలువతో సన్మానించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జైనథ్(బేల), జూన్ 9 : బేల మండలంలోని చెప్రాల గ్రామానికి చెందిన తిరన్‌కర్ వినోద్(20) అనే యువకుడు మద్యం మైకంలో పురుగుల మందు తాగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి ఆదివారం రిమ్స్‌కు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

దస్తురాబాద్, జూన్ 9 : మండలంలోని భూత్కుర్ పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు రద్దీ నెలకొంది. మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యాలను, నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండ కేంద్రానికి చెందిన నిమ్మతోట రాకేశ్ దంపతులు ఎల్క్ట్రికల్ డోల్‌ను విరాళంగా అందజేశారు.

అత్యాధునిక వైద్య సేవలకు కేరాఫ్‌గా సాక్షి దవాఖాన

ఎక్కువ మందికి సేవ చేసే అవకాశం లభించింది

భైంసా, జూన్, 9 : భైంసా పట్టణంలో అత్యాధునిక వైద్య సేవలకు కేరాఫ్ అడ్రస్‌గా సాక్షి ఆసుపత్రి నిలుస్తున్నది. ఆకాశంలో సగం అయిన అతివలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మగవారికి ధీటుగా సాధికారత కోసం కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే డా. బోస్లే పద్మావతి నందకిశోర్ గృహిణి, తల్లి, సోదరి, ఇల్లాలుగా ఇలా పాత్రలో ఒరిగిపోయి తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. చదువుతో పాటు తదితర రంగాల్లో రాణించి వైద్య వృత్తుని ఎంచుకొని భైంసా పట్టణంలో సాక్షి ఆసుపత్రిని నెలకొల్పి తక్కువ ఫీజుతో మంచి వైద్యాన్ని అందిస్తున్నారు. ఈ ఆసుపత్రి అత్యంత విశ్వసనీయత, ప్రసూతి ఆసుపత్రిగా పరిగణించబడుతుంది. ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు సేవలందిస్తున్నారు. వైద్యవృత్తిలోకి రావడం వల్ల ఎక్కువ మందికి సేవ చేసే అవకాశం లభించింది. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా 24గంటలు అందుబాటులో ఉంటున్నాం. అరుదైన ఆపరేషన్‌లు, పేద వారికి తక్కువ ఫీజుతో మెరుగైన వైద్యం అందిస్తున్నాం. మహిళలకు ఆరోగ్యం పట్ల సలహాలు, సూచనలు అందిస్తున్నాం. ఆసుపత్రికి వచ్చే వారికి నార్మల్ డెలవరీ చేసి పండంటి బిడ్డకు జన్మనిచ్చేలా చూస్తున్నామన్నారు.

- డాక్టర్ బోస్లే పద్మావతి కిషోర్

కొనసాగుతున్న బడిబాట

సుంకిడి గ్రామంలో బడిబాటలో మాట్లాడుతున్న హిందీ పండిత్ సుకుమార్ పెట్కులే

కుంటాల, జూన్, 9 : బడి బాటలో భాగంగా ఆదివారం సేవలాల్ తాండ, అందకూర్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడుల్లో అందించే ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతి, దుస్తులు, నోట్ బుక్స్ హాస్టల్ వసతులపై అవగాహన కల్పించామని జడ్పీ హెచ్ఎస్ కుంటాల ఉపాధ్యాయులు తెలిపారు. ఇక్కడ ఉపాధ్యాయులు సగ్గం గంగాధర్, సాహెబ్ రావు, ముఖీమ్, ధర్మాజీ, మారుతి పాల్గొన్నారు.

తాంసి(తలమడుగు), జూన్ 9 : తలమడుగు మండలంలో ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం కొనసాగుతుంది. ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుంకిడి హిందీ పండిత్ సుకుమార్ పెట్కులే గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించేలా అన్ని వసతులు ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు పండిత్ శంకర్, పీఈటీ మమత, వినోద పాల్గొన్నారు.

పార్డి(బీ)లో వైద్య శిబిరం

కుభీర్, జూన్ 9 : చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని భైంసా ఏరియా దవఖాన చిన్న పిల్లల వైద్యుడు బందెల నరేష్ సూచించారు. మండలంలోని పార్డి(బీ) గ్రామంలో ఆదివారం చిన్నారులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిన్న పిల్లల్లో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధుల లక్షణాలపై వివరించారు. ఈసందర్భంగా చిన్నారులకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈశిబిరంలో తూం పుష్పలత, తూం రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ బ్యారపు కానోబా, పర్శురాం, డాక్టర్ పోశెట్టి, బందెల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మొహుతూర్ వేడుకలు

నార్నూర్, జూన్ 9 : మండలంలోని ఎంపల్లి గోండు గూడ గ్రామంలో ఆదివాసీల ఆధ్వర్యంలో మొహుతూర్ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. పొలంలోకి వెళ్లి భూదేవికి నైవేద్యం సమర్పించి సంప్రదాయ పూజలు చేసి వానాకాలం సాగును ప్రారంభించారు. ఆదివాసీ మహిళలు సాంస్కృతిక నృత్యం చేశారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందు తమ ఆచారం ప్రకారం కొత్త విత్తనాలతో భూదేవికి పూజలు చేసి వ్యవసాయ పనులను ప్రారంభిస్తామని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటదిగుబడి రావాలని భూదేవిని వేడుకుంటామని గ్రామపెద్దలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

లోకేశ్వరం : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

లోకేశ్వరం, జూన్, 9 : లోకేశ్వరంలోని ప్రభుత్వ పాఠశాలలో 1999-2000 సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము చదువు చెప్పిన విద్యార్థులు దాదాపు 24 సంవత్సరాల తరువాత కలిసి మమ్మల్ని ఈ కార్యక్రమానికి అపూర్వంగా ఆహ్వానించినందుకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు మాట్లాడుతూ గురువుల వల్లనే మేము ఈ రోజు మంచి స్థాయిలో ఉన్నామని అన్నారు. ఇందులో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసి(తలమడుగు), జూన్ 9 : తలమడుగు మండలంలోని భరంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరం విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులతోపాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, వాసు, శారదా, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు రవి, మల్లయ్య, హనుమండ్లు, మహేందర్, జగదీష్ రెడ్డి, కార్తీక్, విజయ్, అర్చన ఉన్నారు.

తాంసి (తలమడుగు) : భరంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నేటి నుంచి ప్రజావాణి

ఎదులాపురం, జూన్ 9 : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని, తిరిగి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి.ప్రశాంత్

ఎదులాపురం, జూన్ 9 : రాష్ట్ర జూనియర్ అటవీ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాణవత్ ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదారాబాద్‌లోని అరణ్య భవన్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఈమేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర జూనియర్ అటవీ అధికారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తన వంతు కృషిచేసి, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చారు.

ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవం

ఎదులాపురం, జూన్ 9 : జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ ఎస్టీయూ పతాకావిష్కరణ చేశారు. అనంతరం పదవీ విరమణ చేసిన సీనియర్ నాయకుడు పోలాజీ కిషన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర, శితల్‌చౌహాన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జాదవ్ రవికుమార్, బానోత్ ఆత్మారం, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి మల్లేష్, జిల్లా కార్యదర్శి షేక్.మునీర్ తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒక్కరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, జూన్ 9 : ఇంద్రవెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సట్వాజీగూడలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ఉమ్మడి జైనూర్ మండలంలోని పట్నాపూర్ గ్రామానికి చెందిన నాగర్‌గోజే నాగ్‌నాథ్(35)కు మండలంలోని సట్వాజీ గూడ గ్రామానికి చెందిన పార్వతితో ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె ఉంది, కాగ భార్యాభర్తల మధ్య మనస్పర్థాలు వచ్చి పార్వతి కొన్ని రోజుల నుంచి పుట్టింట్లో ఉంటుంది. ఆదివారం నాగర్‌గోజే నాగ్‌నాథ్ తన భార్యను తీసుకెళ్లడా నికి మండలంలోని సట్వాజీగూడ గ్రామానికి వచ్చాడు. భార్యా కాపు రానికి రావడం లేదని మనస్తాపానికి గురై అత్తగారి వ్యవసాయ చేసుకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు వెంటనే 108అంబులెన్స్‌కు సమాచారం అందించి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు 108అంబులెన్స్ ద్వారా తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్లు 108అంబులెన్స్ ఫైలేట్ ఆత్రం ఆశోక్, ఈఎంటీ ప్రవీణ్‌లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బోథ్‌లో..

బోథ్, జూన్ 9: కుటుంబ పోషణకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఫ్పూలింగ్ నాయక్ తాండ గ్రామానికి చెందిన రాథోడ్ భాస్కర్(58) కుటుంబ పోషణ కోసం రూ.2 లక్షలు అప్పు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

మాయా ఇంద్రజాల విద్య ప్రదర్శన

దస్తురాబాద్, జూన్ 9 : మండల కేంద్రంలో శనివారం రాత్రి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సాధన శూరులు మాయ ఇంద్రజాల విద్యను ప్రదర్శించారు. కరీంనగర్ జిల్లాకు చెందిన సాధన శూరులు మంత్ర తంత్ర విద్యను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

ఆర్థిక సాయం

ఖానాపూర్ టౌన్/దస్తురాబాద్, జూన్ 9 : పెంబి మండలంలోని పసుపుల గ్రామానికి చెందిన టేకాన్ సుశీల 10వ తరగతిలో 9.2 జీపీఏ సాధించింది. దీంతో హైద్రబాద్‌లోని ఓ ప్రైవేటు ఇంటర్మీడియట్ కార్పొరేట్ కాలేజీలో బాలికకు ఉచిత సీటు వచ్చింది. నిరుపేద అమ్మాయి కావడంతో హైదరాబాద్ వెళ్లడానికి ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతుంది. విషయం తెలుసుకున్న ఖానాపూర్ వాస్తవ్యులు కృష్ణంరాజు వారి మిత్రుల ద్వారా చదువుకోవడానికి రూ.5000 విలువగల వస్తువులను అందించారు. కార్యక్రమంలో బీసీ రమేశ్, తూం చరణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉద్యమ కారుల ఫోరం మండల కమిటీ ఎన్నిక

లోకేశ్వరం, జూన్ 9 : మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం మండల కమిటీ ఎన్నిక స్థానిక శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు డా. ముష్కం రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షుడిగా సంటన్న, ప్రధాన కార్యదర్శిగా ఎం ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడిగా సుదర్శన్ రెడ్డి, సలహాదారులుగా ఎం శ్రీధర్, చిన్నారావు, ఉపాధ్యక్షులుగా మహేంధర్, తండ సాగర్, కోశాధికారిగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గోవులను తరలిస్తే కేసులు నమోదు చేస్తాం

ఎదులాపురం, జూన్ 9 : రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా అక్రమంగా పశువులు, గోవులను తరలిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణ జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం పట్టణంతోపాటు అనంద్‌పూర్, ఘన్‌పూర్, శంకర్‌గూడ, పిప్పర్‌వాడ, లక్ష్మీపూర్, కరంజి